క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



ధరూరు : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్ర బాబు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను ఆదివారం సందర్శించారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో ముచ్చటించారు. ఆహార నాణ్యతపై ఆరా తీశారు. వంట గది పరిసరాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ప్రహరీ నిర్మించాలి



మల్దకల్ : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో కూలిన ప్రహరీని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న వసతి గృహ ప్రహరీ కూలిపోవడంతో కొంతమంది జులాయిలు వసతి గృహంలోకి వెళ్లి పరిసరాలు అపరిశుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు.

ఆకట్టుకున్న ఇంగ్లిష్ రంగవల్లులు



గద్వాలటౌన్ : జిల్లా కేంద్రంలోని దయానంద విద్యా మందిర్‌లో నిర్వహించిన ఇంగ్లిష్ రంగవల్లులు ఆకట్టుకున్నాయి. సోను ఇంగ్లిష్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వినూత్నంగా రంగవల్లులు వేసి అబ్బురపరిచారు. ఇంగ్లిష్ గ్రామర్‌ను ఉపయోగించి రంగవల్లులు వేశారు. కార్యక్రమంలో సీఈఓ చందాజరీనా, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధరూరు : మండల పరిధిలోని గుడ్డెందొడ్డి వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో ఇంగ్లిష్ పోస్టుకు తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 93902 12966కు సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ




ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండపేట గ్రామానికి చెందిన బీసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే విజయుడు ఆదివారం ఆమె భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా ఇటీవల మరణించిన యువరైతు గంగాధర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సుందర్‌రాజు, శ్రీధర్‌రెడ్డి, సింగోటం, సుధాకరెడ్డి, బీసిరెడ్డి, రాముడు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మానవపాడు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం జల్లాపురం చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఎలాంటి ధ్రువపత్రాలు లేనందున టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. టిప్పర్ డ్రైవర్ శివపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రహదారి మరమ్మతు ప్రారంభం



ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి అయిజ మండలానికి వెళ్లే అంతరాష్ట్ర రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. ప్రస్తుతం అలంపూర్ చౌరస్తా నుంచి కంకర వేసిన చోటున బీటీ వేస్తున్నట్లు కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మర్చంట్ పునఃప్రారంభించరా?

- 1993లో కమీషన్ మర్చంట్ ప్రారంభం
- ఏడేళ్లపాటు జోరుగా క్రయ, విక్రయాలు
- 2006లో మూతపడిన వైనం



శిథిలావస్థలో కమీషన్ మర్చంట్ కార్యాలయ భవనాలు

అయిజ : మండలంలో కమీషన్ మర్చంట్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించలేక కష్టాలు పడుతున్నారు. గతంలో కమీషన్ మర్చంట్ ఉండటంతో మండంలోనే క్రయవిక్రయాలు జరిగేవి. నిర్వాహకులకు ప్రోత్సాహ అందకపోవడం, ప్రభుత్వం నుంచి తోడ్పాటు లేకపోవడంతో నిర్వాహకులు అందరూ తప్పుకున్నారు. దీంతో మండలంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పక్క రాష్ట్రాలకు తీసుకెళ్లి విక్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. దీంతో రవాణ ఖర్చులు అధికమవుతున్నాయంటున్నారు. ప్రభుత్వం స్పందించి మండలంలో కమీషన్ మర్చంట్‌లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

1993లో ఏర్పాటు..

మండల కేంద్రంలో 1993 సంవత్సరంలో వ్యవసాయ మార్కెట్ సబ్ యార్డ్‌లో కమీషన్ మర్చంట్‌ను ప్రభుత్వం ప్రారంభించింది. మండలంలోని రైతులే గాక చుట్టు పక్కల మండలాల నుంచి కూడా రైతులు పంట తెచ్చి విక్రయించేవారు. ప్రారంభించిన మూడేళ్లు మూడు పువ్వులు, ఆరు కాయలగా వెలుగొందింది. అటు రైతులకు ఇటు వ్యాపారులకు సౌకర్యంగా ఉండింది. కాల క్రమేణా మర్చంట్ నిర్వహణ సన్నగిల్లింది. కనీస వసతులు లేక పోవడంతో అటు రైతులు, ఇటు వ్యాపారులు అనేక ఇబ్బందులు పడ్డారు. కమీషన్ మర్చంట్ యజమానులకు అనేక సమస్యలు ఎదురవుతున్నా మర్చంట్‌ను కొన్నేళ్లపాటు నిర్వహించారు. ప్రభుత్వ ప్రోత్సాహం అందకపోవడంతో మర్చంట్ యజమానులు అందరూ తప్పుకున్నారు. దీంతో కార్యాలయ భవనాలు కూడా శిథిలమయ్యాయి.

అధికారులు, ప్రజా ప్రతినిధులతో మొర..

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సబ్ యార్డ్‌లో కమీషన్ మర్చంట్ ఏర్పాటు చేయాలని రైతులు 2011లో అప్పటి కలెక్టర్ పురుషోత్తంరెడ్డికి, 2012లో అప్పటి ఎమ్మెల్యే అబ్రహంకు, 2013లో అప్పటి ఎంపీ మందా జగన్నాథంకు వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల 2024 సెప్టెంబర్‌లో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడును, అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్నను రైతులు కలిసి తమ బాధలు విన్నవించుకున్నారు.

వ్యయ ప్రయాసలతో పంట తరలింపు..

రైతులు పండించిన పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. పత్తి, కంది, వాము, జొన్న తదితర పంటలు పొరుగు రాష్ట్రమైన కర్నాటకలోని రాయిచూర్ జిల్లా కేంద్రంలో మార్కెట్‌లో, వేరుశనగ తదితర పంటలను గద్వాల జిల్లా కేంద్రంలో విక్రయిస్తున్నారు. కొంతకాలం ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మిగనూర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.



వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్ ముఖ ద్వారం

అవస్థలు పడుతున్నాం..



మండలంలో కమీషన్ మర్చంట్ లేనందున అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. గతంలో అయిజలోని మర్చంట్ ఉండటంతో సౌకర్యంగా ఉంది. గద్వాల్, రాయిచూర్‌కు పోవాలంటే ఖర్చులు అధికమవుతున్నాయి. అయిజలో పునః ప్రారంభిస్తే బాగుంటుంది.

\- వీరేష్‌రెడ్డి, మూగోనిపల్లి

చర్యలు తీసుకోవాలి..



మండలంలో కమీషన్ మర్చంట్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దూర ప్రాంతాలకు తీసుకెళ్లి క్రయవిక్రయాలు జరపాల్సి వస్తోంది. ప్రభుత్వం మార్కెట్ సబ్‌యార్డ్‌లో కమీషన్ మర్చంట్ ఏర్పాటు చేసి పంట కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

\- శివకుమార్, తొత్తినోనిదొడ్డి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



గతంలో అయిజ మార్కెట్ సబ్‌యార్డ్‌లో కమీషన్ మర్చంట్‌లు నిర్వహించారు. నిర్వహణ లేకపోవడంతో మర్చంట్ కార్యాకలాపాలు ఏళ్ల తరబడి నిలిచిపోయాయి. మర్చంట్ పునఃప్రారంభించాలని రైతులు కోరుతున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

\- జనార్ధన్, మండల వ్యవసాయ అధికారి

మాదాసి కురవల హక్కుల కోసం కృషి



మాట్లాడుతున్న మాదాసి కురవ నాయకులు

శాంతిగనర్ : మాదాసి కురవల హక్కుల కోసం సాధన కోసం కృషి చేస్తానని కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. అందరూ ఐక్యంగా ఉంటేనే మాదాసి కురవల హక్కులు సాధించగలుతామన్నారు. తన వంతుగా పార్లమెంటులో మాదాసి కురవల గొంతుకను వినిపిస్తానన్నారు. నడిగడ్డ ప్రజలకు కర్నూల్‌లో ఆరోగ్యశ్రీలో వర్తించే విధంగా పోరాటం చేస్తానన్నారు. కర్నూల్ డిపో నుంచి అలంపూర్, గద్వాలకు బస్సు సౌకర్యం పెంచుతామన్నారు. కార్యక్రమంలో తాలూకా మాదాసి కురవ సంఘం నాయకులు కురవ పల్లయ్య, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పెద్ద సోమన్న, మల్లికార్జున్, సంపురం రాముడు, మాధవ్, బండి లక్ష్మన్న, గుమ్మ గోవర్ధన్ తదిదరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

గట్టు : మండల పరిధిలోని బోయలగూడెంలో దళితలపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం బోయలగూడెం గ్రామాన్ని సందర్శించిన బాధితులను పరామర్శించారు. గ్రామానికి చెందిన రమేష్, ప్రభాకర్, తిమ్మప్పలపై అదే గ్రామానికి చెందిన మరో సామాజిక వర్గం వారు దాడి చేసి, గాయ పరచినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏంటని ప్రకాష్ ప్రశ్నించారు. దళితులపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మైత్రి బంధం.. మరిచిపోని అనుబంధం





జల్లాపురంలో..

గద్వాలటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల 1999- 2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల అవరణలో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీహెచ్‌ఎం వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు కృష్ణయ్య, ప్రకాష్‌రెడ్డి, అబ్రహాం, వీరన్న, విజయ్, గణేష్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..
మానవపాడులో..

మానవపాడు : మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 20 సంవత్సరాల పూర్తైన సందర్భంగా కలుసుకోవడంతో సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులను ఘనంగా పూలమాల శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోరవెల్లి వెంకటేష్, లాల్‌భాషా, సురేష్, అనురాధ, పుష్పవతి, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉద్యోగుల నిరసన



సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్ : జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన సమ్మె 27వ రోజు కొనసాగుతుంది. ఉద్యోగులకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే వరకు కనీస వేతన స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు, కేజీబీవీ ఎస్ఓలు, సీఆర్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని విధాల సహకరించాలి



మాట్లాడుతున్న ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి

అయిజ: దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాల కార్యక్రమాన్ని అనునిత్యం నిర్వహించే అర్చకులకు ప్రభుత్వం అన్ని విధాల సహకరించాలని ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి కోరారు. ఆదివారం మండలంలోని సింధనూరులో సంఘ సమావేశం నిర్వహించారు. ప్రతి అర్చకుడికి వేతనాలు అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు పాటు పడుతున్న ప్రతి అర్చకుడి ఆకలి తీర్చే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అర్చకుడికి నెలకు రూ.15 వేలు చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సురేంద్ర స్వామి, రఘు స్వామి, నాగఫణి శర్మ, లక్ష్మీకాంత తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం



అయిజలో మాట్లాడుతున్న పల్లయ్య

రాజోళి: రేవంత్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల శ్రీనువాసులు ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ పేరుతో రైతులను నిత్యం మోసం చేసిన రేవంత్‌ను ప్రజలు క్షమించరన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ప్రస్తుతం రైతుల నోట్లో నిబంధనల పేరుతో మట్టి కొడుతున్నారని విమర్శించారు. రైతుల తరపున త్వరలోనే పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

రైతులను నట్టేట ముంచింది..

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్వీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేసిన ప్రజల ఉసురు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగులతుందన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా రూ.15 వేలు చొప్పున అందజేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు కేవలం రూ.12 వేలు ప్రకటించి రైతులను మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మత్తాలి, మాధవ్, అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్‌కు నీరు విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

శాంతిగనర్: ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వడ్డేపల్లి మండలంలోని జూలకల్ శివారులోని ఆర్డీఎస్ కెనాల్ వద్ద ఆయన మాట్లాడారు. కర్ణాటక నుంచి వచ్చే నీటిని రైతులు అక్రమంగా తోడుకుంటున్నారని, మోటార్లు విచ్చలవిడిగా వాడుతున్నారని ఆరోపించారు. గత 11 రోజులుగా అసలు నీరే రావడం లేదన్నారు. దీంతో వేరుశనగ, మిర్చి, రబీ పలు పంటలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. అధికారులు, నాయకులు స్పందించి నీరు విడుదల చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో బీంసేన్ రావ్, సంజీవ రెడ్డి, గోపాలకృష్ణ, రామకృష్ణ, భగత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

అయిజ : సమ్మె చేస్తున్న సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒప్పందం చేసుకున్న హామీలు అమలు చేయకపోవడమంటే కార్మిక వర్గం ప్రజాస్వామిక హక్కులను ప్రభుత్వం కాలరాయడమే అన్నారు. కార్మికులపై ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి ప్రభుత్వం గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఈశ్వర్, సభ్యులు శ్రీనివాస్, పెద్ద రాయుడు, నాగరాజు, భీమన్న, వీరేశ్, తిరుమల్, లక్ష్మన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి

గద్వాల: సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లై స్టాక్ పాయింట్ వద్ద హమాలీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, కార్యక్రమంలో కార్మికులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివకృష్ణ, నరేష్, నందకిషోర్, గోవిందు, ఆంజనేయులు, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చిన్నారులను సన్మానిస్తున్న కరాటే మాస్టర్లు

ఎర్రవల్లి : హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ఆదివారం నిర్వహించిన ఒకటో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. నందిని, యక్షిత, లలిత, రక్షిత్, కార్తీక్, గోకుల్, రేవంత్‌రెడ్డి, హేమంత్, ఉమేష్, భరత్, మనోజ్, గోపినాథ్‌రెడ్డి, హేమచంద్ర బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా కటాస్ విభాగంలో హేమశ్రీ, శ్రీవల్లి, శాన్విత, స్వేచ్ఛ, దినేష్, కేతన్, వరుణ్‌తేజ్, హరివర్ధన్ బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జాతీయ కుంగ్‌ఫూ, కరాటే మాస్టర్లు మహమ్మద్, శ్రీనివాసులు, శివకోటి, విజయ్‌కుమార్ అభినందించి మెమొంటో, మెడల్స్ అందజేసినట్లు ఎర్రవల్లి కరాటే మాస్టర్లు విజయ్, రాజు పేర్కొన్నారు.

ప్రతిభ మెరిసింది.. అవకాశం దక్కింది

- రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక





ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు

గద్వాలటౌన్ : జాతీయ స్థాయిలో సత్తా చాటే ప్రతిభ వారికుంది. ఆ స్ఫూర్తితో ముందుకు సాగారు. అందుకు తొలి అడుగు జిల్లా స్థాయిలో మెరిశారు. మరో అడుగు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వారి కల సాకారానికి మరో అడుగు దూరంలో ఉన్నారు. గద్వాలలోని స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలోని శ్రీనివాస రామానుజన్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో జిల్లా వ్యాప్తంగా వచ్చిన 248 ప్రదర్శనల నుంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థుల పలు నమూనాలను ఎంపిక చేశారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఏడుగురు చొప్పున విజేతలను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 7వ తేదీ నుంచి జడ్చర్లలో ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసలు అందుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు..

- వనరుల నిర్వహణ' అంశం జూనియర్ విభాగంలో ఉత్తనూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి పవన్, సీనియర్స్ విభాగంలో ఉండవెల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి తరుణ్ ఎంపికయ్యారు.
- 'సహజ వ్యవసాయం' అంశం జూనియర్ విభాగంలో గద్వాల అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి జయవంశిక, సీనియర్స్ విభాగంలో ఎర్రవల్లి ఏకశిలా స్కూల్‌కు చెందిన విద్యార్థిని జ్యోతిక ఎంపికయ్యారు.
- 'విపత్తుల నిర్వహణ' అంశం జూనియర్ విభాగంలో అయిజ బ్రైట్ స్టార్ స్కూల్ విద్యార్థిని జరీమి ప్రిన్స్, సీనియర్స్ విభాగంలో గద్వాల బాలికల పాఠశాల విద్యార్థిని జరా అత్తర్ ఎంపికయ్యారు.
- 'ఆహారం, ఆరోగ్యం- పరిశుభ్రత' అంశం కింద జూనియర్ విభాగంలో గద్వాలకు చెందిన శ్రీశారద హైస్కూల్ విద్యార్థిని అక్షయశ్రీ, సీనియర్స్ విభాగంలో శెట్టిఆత్మకూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి తిరుమలేష్ ఎంపికయ్యారు.
- 'రవాణా- కమ్యూనికేషన్' అంశం జూనియర్ విభాగంలో ఉండవెల్లి విశ్వశాంతి స్కూల్ విద్యార్థిని మౌనిక, సీనియర్స్ విభాగంలో గద్వాల బాలురు పాఠశాల విద్యార్థి వినయ్ ఎంపికయ్యారు.
- 'గణిత నమూనాలు మరియు గణన ఆలోచన' అంశం జూనియర్ విభాగంలో గద్వాల సరస్వతి టాలెంట్ స్కూల్ విద్యార్థి వరుణ్, సీనియర్స్ విభాగంలో గద్వాల ఇండో ఇంగ్లిష్ హైస్కూల్ విద్యార్థి ఉషశ్రీ ఎంపికయ్యారు.
- 'వ్యర్థాల నిర్వహణ' అంశం జూనియర్ విభాగంలో గద్వాల అక్షర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి అచ్యుత్, సీనియర్స్ విభాగంలో గద్వాల శారద స్కూల్ విద్యార్థి సోహెల్ ఎంపికయ్యారు. అదే విధంగా ఇన్‌స్పైర్ విభాగంలో సాయి ఆహల్య, అక్కల వైష్ణవి, లక్ష్మికుమార్, అల్ఫిషా, వీరపోగు సూర్యకిరణ్‌లు ఎంపికయ్యారు. సెమినార్ విభాగంలో గద్వాల నోబుల్ స్కూల్ విద్యార్థిని కావ్య, టీచర్ ఎగ్జిబిట్ విభాగంలో గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజు ఎంపికయ్యారు.



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

జిల్లా స్థాయిలో..

జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో చాగదోన ఉన్నత పాఠశాలకు చెందిన ఉపేంద్ర సీనియర్ విభాగంలో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి, ఉత్తనూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి పవన్ జూనియర్ విభాగంలో మెదటి బహుమతి, సరస్వతీ పాఠశాల విద్యార్థులు రాజశ్రీ, నిషిత నవీన్‌కుమార్, ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రవితేజ, తరుణ్ బహుమతులు గెలుచుకున్నారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఉపాధ్యాయులకు మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ ఘనీ, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్ పాపన్న తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగ మంచు



ఉండవెల్లి: మండలంలోని గ్రామాల్లో పంట పొలాలను మంచు దుప్పటి కప్పేసింది. ఆదివారం పొగ మంచులోనే రైతులు, కూలీలు పనులు చేపట్టారు. ఒకవైపు ఆహ్లాదం మరోవైపు చలి పంజా విసురుతోంది.